క్లుప్తంగా

ఘనంగా గజ్జలమ్మతల్లి పండగ


పూజలందుకుంటున్న గజ్జలమ్మతల్లి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కుంచమ్మకాలనీలో కొలువుదీరిన గజ్జలమ్మతల్లి పండగను మంగళవారం కుంచమ్మకాలనీ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘమాసంలో అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా జరిగిన పూజల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు,నాయకులు సత్యనారాయణరెడ్డి,శ్రీనుబాబు,రజక సంఘం పెద్దలు చెరకాపు రామారావు,చెరకాపు రాజు,వరహాలు తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

సింథియా: షిప్‌యార్డ్‌లో పని చేస్తున్న ఎల్ అండ్ఎం సిరీస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో షిప్‌యార్డ్ బీఎంఎస్ ప్రతినిధులు మంగళవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ భద్రత కోసం ఎదురు చూస్తున్న సుమారు 370 మంది షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. షిప్‌యార్డ్ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే విధంగా ఆర్డర్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ బీఎంఎస్ అధ్యక్షుడు సింహాచలం, పి.శంకర్,సుధాకర్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో గురుకుల కన్వీనర్ సత్యారావు

విశాఖ విద్య: చిత్ర లేఖన పోటీల్లో బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని గురుకులాల జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు తెలిపారు. గుంటూరులో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో సింహాచలం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్, ఐదుగురు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన డ్రాయింగ్ టీచర్ శ్వేతను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించాలన్నారు.

వసతి గృహాల్లో పోలీసుల తనిఖీలు


దుస్తులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో సోమవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఏయూ హాస్టళ్లలోకి అనధికార వ్యక్తులు ప్రవేశించడం, వారి వద్ద అనుమానిత ప్యాకెట్ లభించిన నేపథ్యంలో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి వర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో హాస్టల్ గదులను పరిశీలించారు. దాదాపు 30 మందికిపైగా పోలీసులు ఈ సోదాల్లో పాల్గొన్నట్టు తెలిసింది. అయితే వారి తనిఖీల్లో ఎటువంటి అనుమానిత వస్తువులు లభించలేదు. బయటి వ్యక్తులు కూడా ఎవరూ లేరని పోలీసులు నిర్ధారించారు.


ప్రత్యేక తరగతులకు హాజరైన ఆర్పీపేట పాఠశాల విద్యార్థులు


సామర్థ్య పరీక్ష రాస్తున్న కంచరపాలెం ఆర్పీపేట పాఠశాల విద్యార్థులు

ప్రత్యేక ప్రణాళికతో 'సిద్ధం'

- పది పరీక్షల్లో శతశాతం సాధిస్తామని ఆర్పీపేట, కప్పరాడ టెన్త్ విద్యార్థుల ధీమా
- ఉత్తమ ఫలితాల దిశగా ఉపాధ్యాయుల కృషి
- విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులకు అవగాహన తరగతులు


కప్పరాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల అనుమానాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయురాలు


సామర్థ్య పరీక్ష రాస్తున్న కప్పరాడ పాఠశాల విద్యార్థులు

కంచరపాలెం : పాఠశాల విద్యలో ప్రతి విద్యార్థికి టెన్త్ ఎంతో కీలకం. పబ్లిక్ పరీక్షలంటే వారిలో ఉండే భయాన్ని తొలగించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం.. ప్రభుత్వ బడులపై ప్రత్యేక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కంచరపాలెం ఆర్పీపేట, కప్పరాడ ఉన్నత పాఠశాలల్లో మార్చి 18 నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్. శ్రీనివాసరావు, వి.విజయమాలిని తెలిపారు.

ఆర్పీపేట ఉన్నత పాఠశాల నుండి టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు 148 మంది. వీరిలో బాలికలు 64 మంది, బాలురు 74 మంది. కప్పరాడ ఉన్నత పాఠశాల నుండి 115 మంది పరీక్షలకు హాజరు కానుండగా.. వీరిలో బాలికలు 53, బాలురు 62 మంది ఉన్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తి కావడంతో ఉదయం , సాయంత్రం వేళల్లో సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదు అందిస్తున్నారు.

భవిష్యత్తుకు ఇదే పునాది..

భవితను నిర్దేశించే పరీక్షలు.. అందునా జీవితంలో మొదటిసారి ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు రాసిన పరీక్షలు ఒకెత్తు.. ఇవి మాత్రం ప్రత్యేకం. దీంతో కాస్త ఒత్తిడి ఉండడం సహజమే. అయితే నిత్యం తర్ఫీదు పొందుతూ ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యామంటున్నారు పలువురు టెన్త్ విద్యార్థులు. కరోనా కాలంలో చదువులు సక్రమంగా లేక పోవడంతో పునాది కాస్త మందగించడంతో వీరికి శిక్షణ ఇవ్వడం కాస్తా కష్టంగా మారినా సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సన్నద్ధం చేశామని ఉపాధ్యాయులు తెలిపారు.

పాత ప్రశ్నపత్రాలు పరిశీలించా..



పాత టెన్త్ పరీక్ష పేపర్లను ఎక్కువగా పరిశీలించా. దీంతో ఒక అవగాహన వచ్చింది. ఉపాధ్యాయులు చెప్పిన ప్రణాళికను అనుసరించి చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. మా పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు మా సందేహాలను తరగతి గదిలో నివృత్తి చేస్తున్నారు.

– అనకాపల్లి భవానీ, ఆర్పీపేట, ఉన్నత పాఠశాల

నిర్దేశించిన సిలబస్ అనుసరిస్తూ..



పాఠశాలలో టీచర్లు చెప్పే అంశాలను అనుసరిస్తూ తరగతిలోనూ, ఇంటి దగ్గర పరీక్షలకు సిద్ధమవుతున్నాం. మాకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నా రు. పరీక్షల కోసం స్కూలు సిలబస్‌తో పాటు, స్టడీ మెటీరియల్, ఆల్ ఇన్ వన్‌కూడా అనుసరిస్తున్నాను.

– సీహెచ్ జశ్వంత్, ఆర్పీపేట ఉన్నత పాఠశాల

రివిజన్ చేస్తున్నా..



ప్రత్యేక తరగతుల్లో ఉదయం, సాయంత్రం గణితంలో సమస్యలను సూక్ష్మపద్ధతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు చెబుతున్నారు. టీచర్లు అన్ని సబ్జెక్టులు పూర్తి చేశారు. పట్టుదలగా రివిజన్ చేస్తున్నాను. ఇంట్లో అమ్మ పోషక విలువలున్న తేలికపాటి ఆహారం ఇస్తోంది.

– గంట్యాడ మరియా, కప్పరాడ ఉన్నత పాఠశాల

శతశాతం సాధిస్తాం..



పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. వారంతా కష్టపడి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించే విధంగా ప్రణాళిక రూపొందించాం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నాం.

– ఆర్ శ్రీనివాసరావు, హెచ్ఎం, ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం

అన్ని మెటీరియల్స్‌తో బోధన..



టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన వారికి ఆయా సబ్జెక్ టీచర్లతో అనుమానాలు నివృత్తి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో నిర్వహించే తరగతుల్లో పూర్తిస్థాయిలో హాజరు చూస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు అందించిన అన్ని మెటీరియల్స్‌తో బోధన చేస్తున్నాం.

– విజయమాలిని హెచ్ఎం, కప్పరాడ, ఉన్నత పాఠశాల ఐటీఐ జంక్షన్

ప్రజల సహకారంతోనే సజావుగా ఎన్నికలు


కన్నూరులో మాట్లాడుతున్న సీఐ బాల సూర్యారావు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమణ

పరవాడ: త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు కోరారు. మండలంలోని కన్నూరు గ్రామంలో పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అనంతరం ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొడవలకు తావులేకుండా సమన్వయంతో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ గొల్లవిల్లి నాగమణి, ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పైడివాడలో..

సబ్బవరం: మండలంలోని పైడివాడ గ్రామంలో ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు మంగళవారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పద్ధతిగా నడుచుకోవాలన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండడంతో గ్రామాలలో రెచ్చగొట్టే ప్రసంగాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు నమ్మొద్దు

తాటిచెట్లపాలెం : రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)లో కానిస్టేబుళ్లు, ఎస్ఐల రిక్రూట్‌మెంట్ పేరిట వివిధ మాధ్యమాల్లో ప్రసారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని రైల్వే బోర్డు డీఐజీ శ్రీకా మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీయూ ఎగ్జామ్‌నెట్ వెబ్ సైట్‌లో ఆర్పీఎఫ్‌లో 4208 కానిస్టేబుళ్లు, 452 సబ్ ఇన్‌స్పెక్టర్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిలో ఎంతమాత్రం వాస్తవం లేదని తెలిపారు. ఇటువంటి నోటిఫికేషన్ ఏదీ రైల్వే శాఖ జారీ చేయలేదని, ఎవరూ నమ్మొద్దని రైల్వే బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–8 (వేపగుంట) పరిధిలో గల జీవీఎంసీ దుకాణాలు, మార్కెట్లను ఏడాది కాల పరిమితికి కాంట్రాక్ట్ ఇచ్చేందుకు మార్చి 2న బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వేపగుంట జోనల్ కార్యాలయంలో నిబంధనలకు లోబడి కమిషనర్‌చే అనుమతి పొందిన వారితో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలం పాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోన్–8 కార్యాలయ పని వేళల్లో కార్యాలయ పర్యవేక్షకులను సంప్రదించాలన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం


ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు మంగళవారం నాటికి 1,111వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొని విశాఖ ఉక్కు –ఆంధ్రుల హక్కు అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీపరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు, కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కంచరపాలెం: స్థానిక ఊర్వశికూడలిలోని న్యూటన్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ నమూనాలతో అబ్బురపరిచారు. జామెట్రికల్ నగరం, చంద్రయాన్–4, ట్రాఫిక్ నియమాలు, సోలార్ విద్యుత్ తయారీ, కాలుష్యాలు, నివారణా మార్గాలు తదితర ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు ,ప్రిన్సిపాల్ మిథు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


కరెన్సీ, పూలమాలల అలంకరణలో కొత్తమ్మతల్లి
పండ్ల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం రూ.10, రూ.100 నోట్లు, గజమాలలు, బంతి, చామంతులతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు కొత్తపేటకు చెందిన రొక్కం శ్రీనివాసరావు, పుష్ప దంపతులు ఆర్థిక సహకారం అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు తదితరులు అలంకరించారు. భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని ఆపిల్, నారింజ, ద్రాక్ష, బత్తాయి, సపోటా, దానిమ్మ, చెర్రీలతో అలంకరించారు. ఈ అలంకరణకు పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ రౌతులపాలెం, రెడ్డివారి కళ్లాలకు చెందిన సిడం పెంటయ్య, అప్పలరాజు దంపతులు సహకరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నా రు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

విమాన్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

గోపాలపట్నం: విమాన్‌నగర్‌లో సోమవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. ఇద్దరు వృద్ధులు వెళ్తుండగా విమల అనే వృద్ధురాలి మెడలో బంగారు నగలు తెంచుకుపోయారు. బాధితులు, క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. విమల విమాన్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. ఇటీవల తీర్థ యాత్రకు వెళ్లి వచ్చారు. సోమవారం రాత్రి స్థానికంగా ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి మరో వృద్ధురాలితో వెళ్లారు. దర్శనం తర్వాత తిరిగి ఇంటికి రాత్రి 8 గంటల సమయంలో వెళ్తుండగా ఐఎన్ఎస్‌డేగా బేరక్ వద్ద ఇద్దరు యువకులు బైక్‌పై హెల్మెట్ పెట్టుకుని వచ్చి విమల మెడలో చైన్ తెంపుకొని పరారయ్యారు. పుస్తెల తాడు, కాసులు సుమారు 3తులాల ఉంటుందని బాధితులు చెబుతున్నారు. సీఐ ఎన్. శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ బాధితుల నుంచి వివరాలు సేకరించారు. మంగళవారం ఉదయం స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువత కలలను సాకారం చేసుకోవాలి

మల్కాపురం: దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా చూడాలని యువతరం ఆశిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు అన్నారు. యువ సంవాద్ అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. యువత కలలను సాకారం చేసుకునే విధంగా అడుగులు వేయాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని అది నెరవేరే వరకు యువత శ్రమించాలన్నారు. యవత సన్మార్గంలో నడుస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా యువ సంవాద్ కార్యక్రమం కింద నిర్వహించిన వ్యక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ ఎస్.హరినాథ్,జిల్లా ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి


పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ఇతర అధికారులు

మహారాణిపేట : మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాలలోపు పిల్లల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 2,08,163 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. 1002 పోలియో కేంద్రాలు, 74 మొబైల్ బృందాలు, 32 ట్రాన్సిట్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 6,51,702 ఇళ్లను మార్చి 4,5 తేదీల్లో పరిశీలించి ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులుంటే అటువంటి వారికి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేస్తామన్నారు. జిల్లాలో 2,65,820 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, వైద్యులు జగదీష్ ప్రసాద్, మురళీకృష్ణ, రవిశంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి సైన్సే సోపానం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: సుస్థిరమైన భవిష్యత్‌కు శాస్త్రవిజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జియోఫిజిక్స్ విభాగంలోని సి.వి.రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ఫ్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ.. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువత సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా రంగానికి అపారమైన నిధులు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. కోర్సుల రూపకల్పన, ప్రయోగశాలల ఆధునికీకరణ, ఇంటర్న్‌షిప్‌లు కల్పన, స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలిపారు. ఎడ్ఎక్స్ కోర్సులను రాష్ట్ర యువతకు ఉపయుక్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ మీ వైఖరులే మీ భవిష్యత్ ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. వర్సిటీ వసతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. మీలోని సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 25కి పైగా పేటెంట్‌లు దాఖలు చేశామని, 82 శాతం విద్యార్థులకు గతేడాది ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏయూలో 9 ఏళ్లకు పైగా సి.వి రామన్ విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు అనురాధ కామేశ్వరి, సంధ్య దీపిక, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, జి.శశిభూషణ రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.